క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ

భీమవరం అర్బన్ : దాతలు అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు పి.ఎలైజా దాని అన్నారు. గొల్లవానితిప్ప గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అరసవల్లి ఛారిట్రబుల్ ట్రస్టు సహకారంతో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సుమారు రూ.12వేల విలువ చేసే విద్యా సామాగ్రి, పుస్తకాలను అరసవల్లి ఈశ్వరమ్మ, వెంకటచారి ఛారిట్రబుల్ ట్రస్టు పేరిట అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గునెళ్ల కృష్ణమూర్తి, బి.భారతి, విజయ భారతి, వి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బైర్రాజు వర్ధంతి



పెదఅమిరంలో సత్యనారాయణరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని పెదఅమిరం, కోలనపల్లి గ్రామాల్లో బైర్రాజు సత్యనారాయణరాజు 23వ వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ప్రముఖులు మాట్లాడుతూ బైర్రాజు ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కటారి విశ్వనాథరాజు, ఎంపీటీసీ వేగేశ్న సత్యనారాయణరాజు, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.భానుమూర్తి, ఎం.రామకృష్ణ, డ్వాక్రా సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం 150 రోజుల సంబరాలు

ఉండి: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నియోజకవర్గంలో ప్రారంభించి 150 రోజుల పూర్తి కావస్తున్న సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉండిలో ప్రత్యేక కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ముందుగా 3 గంటల నుంచి గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం కళింగపేటలోని కళ్యాణ మండలపంలో కేక్ కటింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన తెలిపారు.

పెన్నాడలో డీపీఓ విచారణ

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో గ్రామ పంచాయతీకి చెందిన బావి ఆక్రమణకు గురైందంటూ గ్రామానికి చెందిన జాతీయ దళిత నాయకుడు కోరం ముసలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీపీఓ జీవీకే మల్లికార్జునరావు విచారణ చేపట్టారు. పెన్నాడ గ్రామంలో కొన్ని సంవత్సరాల క్రితం నీటి అవసరాల కోసం గ్రామంలోని చిన్నపేటలో పంచాయతీ నిధులతో బావిని తవ్వించారు. ఆ బావిలోని నీరునే ఆ ప్రాంతంలోని ప్రజలందరూ వాడుకునేవారని, కానీ ప్రస్తుతం ఆ బావిని గ్రామానికి చెందిన సాలా మాసరయ్య ఆక్రమించుకుని ఆ బావి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నారని గ్రామానికి చెందిన ముసలయ్య జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే డీపీఓ మల్లికార్జునరావు ఆ ప్రాంతానికి వెళ్లి విచారణ చేశారు. మండల అధికారులతో ఆ బావి ఉన్న ప్రాంతాన్ని సర్వే చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలోని నాన్ లేఔట్లను పరిశీలించి ఆ నాన్ లేఔట్ల వద్ద నోటీస్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈవోపీఆర్డీ దొంగ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి లక్ష్మి, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

నరసాపురం రూరల్: ప్రైవేటు కళాశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షం కురిసిన సందర్భంలో రహదారి మొత్తం అధ్వానంగా తయారవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గతేడాది పాఠశాల యాజమాన్యంతో తల్లిదండ్రులు గొడవకు దిగారు. ఏడాది గడచినా రహదారిని నిర్మించలేదు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే పాఠశాలకు వెళ్లే రహదారి నీట మునిగి అధ్వానంగా తయారవడంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాల ప్రాంగణంలో రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారి నుంచి 200 మీటర్ల మేర ఉన్న ప్రైవేటు స్థలంలో రహదారి నిర్మాణం చేపట్టక పోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని వారంతా వాపోయారు. యాజమాన్యాలు ముందుకు వచ్చి గతంలో ఇచ్చిన హామీ మేరకు రహదారిని అభివృద్ధి చేయకపోతే ఫీజులు కట్టేదిలేదని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల తీరుపై చేపట్టిన ఈ ఆందోళన సుమారు రెండు గంటలకు పైగా కొనసాగింది.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం



ఉండిలో మహిళకు సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రం ఉండిలో గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, మహంకాళి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండవరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన వలన ప్రజలంతా సుఖ సంతోషాలతో బతుకుతున్నారన్నారు. ఇంతగా ప్రజలకు లబ్ధిని చేకూర్చిన నాయకుడు దేశ చరిత్రలో ఎవ్వరూ లేరన్నారు. పాదర్శకంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తుంటే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు జగన్ ప్రభుత్వంలో జరిగే మంచిని వారి ఖాతాలో వేసుకోవాలని టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.కొన్ని గ్రామాల్లో తాము ఇంటిస్థలాలు ఇప్పిస్తాము, ఇళ్ళు కట్టిస్తామంటూ అబద్ధ ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాల కుయుక్తులు ప్రజలకు తెలుసును కనుక వారిని తరిమికొడుతున్నారన్నారు. ప్రజలకు మరింత మంచి జరగాలనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఏదైనా ఇబ్బందులతో సంక్షేమ పథకాలు ఆగిపోతే వెంటనే అధికారులు స్పందించి వారి సమస్యలు పరిష్కరించి వారికి కావలసిన ధ్రువపత్రాలు జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిస్తారన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుందన్నారు. చదువులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందన్నారు.అమ్మ ఒడి ద్వారా చిన్నారులకు సహాయంతో పాటు జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, నాడునేడు తదితర కార్యక్రమాలతో ప్రభుత్వ విద్యావ్యవస్థను సమూలంగా మార్చివేసారన్నారు.అందుకే ప్రజలంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని, రాబోయే సాధారణ ఎన్నికల్లో ఇదే జరిగి తీరుతుందని పీవీఎల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్‌లు గులిపల్లి అచ్చారావు, కొప్రపాటి అనిత, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రణస్తుల మహంకాళి, జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గిరడ రమణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు ,గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జున, కమతం బెనర్జీ, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, బాతు జాన్సన్, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, రాయి సతీష్, శేషాద్రి శ్రీను, గలావిల్లి ధనుంజయ, బొచ్చా అచ్చారావు, గుండు నాగేశ్వరావు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, సూరవరపు వెంకటాచార్యులు, గాంధీరాజు,పీ రామరాజు, గిరడ శ్రీను, చిట్టూరి జార్జ్, అందుకూరి రాజు, కొమ్మన రాఘవ, సిరికి ఎర్రయ్య, మల్లువలస సత్యనారాయణ, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు, వర్రే పైడియ్య, బొక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష



13వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణంలోని 13వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ కన్వీనర్ గంటా అనితారాణి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ఎన్ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ భీమశంకరం, ఎ కల్యాణ్, వలంటీర్ వై మాధవి, గృహ రథసారథి మేరి, గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు చేర్చడమే లక్ష్యం



స్థానిక సచివాలయం-2లో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: అర్హులను ఆదుకునేందుకు జగనన్న సురక్ష పథకం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక సచివాలయం-2లో వలంటీర్లు, గృహసారథులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులకు న్యాయం జరిగే విధంగా సీఎం జగన్ తీసుకున్న చర్యలు చరిత్రాత్మకమన్నారు. ప్రభుత్వ పథకానికి అర్హులై ఉండి సంబంధిత ధ్రువపత్రాన్ని తెచ్చుకోలేని వారికి వారి గ్రామం వెళ్లి ధ్రువపత్రాన్ని అందజేసే విధంగా మండల స్థాయి అధికారుల్ని పంపుతున్నారని చెప్పారు. వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులై, ప్రభుత్వ పథకం పొందలేని వారిని గుర్తించాలని సూచించారు. గత ప్రభుత్వాలు, నాయకులు, ప్రభుత్వ పథకాల్ని వారి అనుసరులకు, బంధువులకు కేటాయించుకున్నారని హైమావతి ఆరోపించారు. పథకాల అమలులో కూడా అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శించారు. సచివాలయ కన్వీనర్ అందేరాజబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి అర్హుల్ని గుర్తించాలన్నారు. నిజమైన అర్హులకు పథకం అందకపోవడం అనేది మనం చేసిన తప్పు అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు మంచి పేరు తీసుకువచ్చే విధంగా వలంటీర్లు, గృహసారథులు అర్హులందరినీ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శిరపు శ్రీనివాస్, కుంచాడ బాబ్జీ, తిమ్మారెడ్డి మాధవి, వీజే.కోటేశ్వరరావు బాబు, శ్రీహరి, ఎమ్మెల్‌ఓ టోనీ, తదితరుల పాల్గొన్నారు.

గుమ్ములూరులో

జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లకు, గృహసారథులకు మంగళవారం జగనన్న సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్ పుప్పాల సత్యనారాయణ(పండు) అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట అనంత లక్ష్మీ, అన్నెం కృష్ణ, చెక్కా రాజామణి, ఎమ్మెల్‌ఓ టోనీ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే..



పెదఅమిరం గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

కాళ్ల: అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తోందని కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామకృష్ణంరాజు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. జగనన్న సురక్షలో భాగంగా గ్రామ వలంటీర్ల ద్వారా చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఏ విధంగా చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పరిశీలించారు.ప్రతి ఇంటికి వెళ్లి ఏయే సమస్యలు ఉన్నాయని ప్రజలను అడిగితెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా ఈ కార్యక్రమంలో పరిష్కారం అవుతాయని జయరాం కృష్ణంరాజు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ పని చేసిన ప్రజల క్షేమం గురించి చేస్తారని వారి అభివృద్ధికి గురించి ఆలోచిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వలంటీర్లు గృహసారథులు ఉన్నారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

సాక్షి, భీమవరం : విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. మంగళవారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు(పీఎస్ఎమ్) మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా పేద విద్యార్థులు చదువులో వెనుకబడి పోకుండా ఉండేందుకు ప్రభుత్వం విద్యాదీవెన, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి అనేక పథకాలు అమలుచేస్తు విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం జె.సుధారాణి, వారణాశి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

నరసాపురం రూరల్: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నరసాపురం మున్సిపాలిటీ కఠిన చర్యలు చేపడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం మెయిన్‌రోడ్డు, మార్కెట్ ఏరియాలోని పలు దుకాణాలు ,హోటళ్ల వద్ద ఆకస్మిక తనిఖీ చేపట్టి ప్లాస్టిక్ కవర్లను సేకరించారు. శానిటేషన్ టాస్క్ ఫోర్స్ టీంలతో కలిసి సచివాలయ, మున్సిపల్ సిబ్బంది ఈ దాడులను నిర్వహించారు. సుమారు 40 కిలోల ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీన పరచుకుని సదరు షాపుల వారికి రూ.పది వేలు జరిమానా విధించారు.

రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ 2.88 లక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం శ్రీరామపురంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి వారి హుండీలను మంగళవారం లెక్కించగా రూ 2.88,104 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి దండు కృష్ణంరాజు తెలిపారు. గత ఏడునెలల కాలంలో భక్తులు స్వామివారి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం లభించిందన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు నిమ్మల బాల సుబ్రహ్మణ్యం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

వీరవాసరం : సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈ స్వామి నాయుడు అన్నారు. వీరవాసరం మండలంలోని రాయకుదురులో నూతనంగా నిర్మిస్తున్న రహదారులను మంగళవారం ఆయన ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లోని రహదారుల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రజలు అంతర్గత రహదాలను సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాదిక్ గెడ్డం భాస్కరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగానమ్మ గుడి తెరవాలని ఆందోళన

ఆకివీడు: స్థానిక సమతానగర్‌లోని గంగానమ్మ గుడి మూసివేయడంతో భక్తులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఆలయం తెరవకపోవడం వల్ల భక్తులు ఆందోళనకు దిగి, ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆలయంలో పనిచేసే అర్చకుడికి గత ఆరు నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో గుడికి వెళ్లకపోవడంతో తాళాలు వేసినట్లు భక్తులు తెలిపారు. అర్చకుడికి జీతం ఇచ్చి గుడి తలుపులు తెరిపించే విధంగా అధికారులు సహకరించాలని పలువురు భక్తులు డిమాండ్ చేశారు. గంగానమ్మ గుడి తెరవకపోతే అరిష్టం జరుగుతుందని భక్తులు ఆందోళన చేస్తూ నినాదాలు చేశారు.

చీటింగ్ కేసు నమోదు

పాలకోడేరు: పొలం కొనుగోలు చేసుకుని డబ్బులు ఇవ్వకపోగా అడిగినందుకు గాను చంపుతానని బెదిరించిన కేసులో కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విస్సాకోడేరు గ్రామానికి చెందిన పడవల సత్యనారాయణపై చీటింగ్ కేసును పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గొరగనమూడి గ్రామానికి చెందిన పెన్మెత్స గీతావాణి 2020లో రెండున్నర ఎకరాల పొలాన్ని రూ.11,54,562కు కొనుగోలు చేశారు. అయితే కొనుగోలు చేసుకున్న అనంతరం కొంత సొమ్ము ఇచ్చిన అనంతరం మిగిలిన సొమ్ము ఇవ్వకుండా బెదిరించడమే కాకుండా గీతావాణిని చంపుతానని బెదిరించడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పడవల సత్యనారాయణపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యామిలీ ఫిజిషియన్

మొగల్తూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లీనా సుప్రియ కోరారు. మంగళవారం మొగల్తూరు 2 సచివాలయ పరిధిలోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన సుమారు 70 మంది రోగులకు సేవలందించారు. నడవలేని పరిస్థితిలో ఉన్న రోగులు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసారు.

రొయ్యల చెరువుల నీరు పంట కాలువల్లోకి

కలుషిత నీటితో ప్రజలు, రైతుల ఆందోళన



రొయ్యల చెరువుల్లో నీరు వదలడంతో పచ్చని రంగులోకి మారిన కాళ్లలంక ఛానల్

కాళ్ల: ఆక్వా చెరువుల యాజమాన్యాల చర్యలతో ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని కాళ్ల గ్రామ రైతులు, ప్రజలు వాపోతున్నారు. కోలనపల్లి గ్రామ పరిధిలో ఆక్వా చెరువుల జలాలను కె.లంక ఛానల్ పంట కాలువలోకి గండి కొట్టడంతో పంటకాలువలోని నీరు పూర్తిగా పచ్చరంగులోకి మారి నారుమళ్లు మాడిపోవటమే కాకుండా తాగునీటి చెరువులు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు మంగళవారం కె.లంక ఛానల్ వెంబడి రైతులు గ్రామస్తులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ పంటకాలవకు ఎగువ భాగంలో ఇష్టానుసారంగా చేపల చెరువుల పేరుతో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పంట కాలువకు శివారు గ్రామాలైన కాళ్ల, దొడ్డనపూడి గ్రామాల్లో ఇప్పటికే వరిసాగు కనుమరుగైందన్నారు. అధికారులు విచ్చలవిడిగా చెరువుల తవ్వకాలకు అనుమతులివ్వడంతో ఆ చెరువులే నేడు పంటకాలువల పాలిట ప్రధాన శత్రువుగా మారాయని వాపోయారు. రొయ్యల చెరువుల నీరు నేరుగా పంట కాలువలోకి వదలడంతో సాగునీరు పూర్తిగా పచ్చగా మారిపోయిందని, ఈ నీటితో నారుమడులు వేసుకుంటే మొలకలు రాని పరిస్థితి ఉందని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి కలుషిత జలాలు పంట కాలువలోకి వదులుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బండారు తాతాజీ, ముత్యాల సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత సంఘం నుంచి బహిష్కరించారని ఆరోపణ



దళిత సంఘం నుంచి బహిష్కరించారని ఆరోపిస్తున్న చెక్కా వెంకటేశ్ కుటుంబం



బహిష్కరణ వాస్తవం కాదంటున్న సంఘపెద్దలు, దళితులు

ఆకివీడు : దళిత సంఘం నుంచి తమ కుటుంబాన్ని బహిష్కరించారని మండలంలోని గుమ్ములూరు శివారు హరిజనపేటకు చెందిన చెక్కా వెంకటేశ్ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. పేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వెంకటేశ్ కుటుంబం మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. అంబేడ్కర్ విగ్రహంకు ఎదురుగా రెండు సెంట్ల స్థలం కేటాయించాలని అడిగినందుకు పేటలో సంఘ బహిష్కరణ చేశారని, కొందరు పెద్దలు ఇంటికి వచ్చి మహిళనైన తనపై దాడి చేశారని చెక్కా నయోమిన్ ఆరోపించారు. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులకు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేకూర్చాలని వారు పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

వాస్తవం కాదంటున్న దళిత సంఘం

వెంకటేశ్ కుంటుంబాన్ని సంఘ బహిష్కరణ చేశామనడం వాస్తవం కాదని సంఘ పెద్దలు, దళితులు వివరణ ఇచ్చారు. తమ పేటలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో కమ్యూనిటీహాలు, చర్చి నిర్మాణం చేసుకునేందుకు దళితులంతా చందా వేసుకుని నిర్మాణం చేపడుతుంటే అతనొక్కడే వ్యతిరేకించి, తనకు ఆ భూమిలో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని పట్టుబట్టారని చెప్పారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమాల్ని కమ్యూనిటీహాల్ నిర్మాణ ప్రాంతంలో చేసుకునే విధంగా అవకాశం కల్పించినప్పటికీ అవాస్తవ ఆరోపణలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారని తెలియజేశారు. మండల అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లినా అతని ఆరోపణలు, ఫిర్యాదులు కొనసాగుతున్నాయన్నారు. పేటలో అతనికి ఏవిధమైన ఆటంకం, అడ్డంకులు కల్గించలేదని, సంఘపెద్దలు, దళితులతో అతనే మాట్లాడకుండా వెళ్లిపోతున్నాడని పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో సంఘ పెద్దలు చొప్పల వెంకటేష్, టీ.మోషేన్, మద్దా మరియమ్మ, పీ.రాజు, ఆర్.ఏసుబాబు, మహిళలు, దళితులు పాల్గొన్నారు.

బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న పవన్



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

పాలకొల్లు అర్బన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నరసాపురం సభలో ఎస్సీ, బీసీలపై ప్రేమ ఉన్నట్టు ప్రసంగించడం చూస్తుంటే సవతి తల్లి ప్రేమ గుర్తొస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని పవన్ విమర్శించడం చూస్తుంటే ఆయనకు ఏపీ రాజకీయాల పట్ల అవగాహన లేదని అర్థమవుతోందన్నారు. గోదావరి జిల్లాల్లో పవన్ కల్యాణ్ పర్యటనలో ఆయన మాట్లాడే తీరు చూస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు రాసిన స్క్రిప్టును అక్షరం వదలకుండా చదువుతున్నట్లు ఉందని శ్రీనివాస్ దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలో ఉండగా ఎస్సీ, బీసీ ప్రాంతాల్లోని చంద్రబాబు నాయుడు మూసివేసిన పాఠశాలలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి తెరిపించి నాడు- నేడు నిధులతో ఆ పాఠశాలల రూపు రేఖలు మార్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ వ్యవస్థ ద్వారా 1.35లక్షల మంది నిరుద్యోగులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. యువతను రెచ్చగొట్టే విధంగా పవన్ మాటతీరు ఉందని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీని స్థాపించి పుష్కర కాలం గడచినా కనీసం అసెంబ్లీ గుమ్మం ఎక్కని పవన్ కల్యాణ్‌కి తన ప్రయోజనం కన్నా చంద్రబాబును సీఎం చేయడం ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ శ్రీనివాస్ దుయ్యబట్టారు.

ఫెర్రీ బకాయిలపై జేఏసీ సమావేశం

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ ఆధీనంలోని మాధవాయిపాలెం ఫెర్రీకి సంబంధించి పాటదారుడు 2 వాయిదాల సొమ్ము రూ.60 లక్షలు బకాయి పడటంతో దీనిపై చర్చించేందుకు ఉభయ గోదావరి జిల్లాల జేఏసీ సభ్యులు సమావేశమయ్యారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. పాటదారుడు బకాయి పడిన సొమ్మును నెలాఖరుకు చెల్లిస్తానని జేఏసీ సభ్యులకు చెప్పారు. దీంతో జూలై మొదటి వారంలో జేఏసీ తిరిగి సమావేశమై ఈ విషయంపై చర్చించాలని నిర్ణయించారు. సానుకూల ఫలితాలు రాకపోతే రేవు నిర్వహణను స్వాధీనం చేసుకుని 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి ఫెర్రీ వేలం నిమిత్తం టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు జేఏసీ తెలిపింది. సమావేశంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, లక్ష్మణేశ్వరం సొసైటీ అధ్యక్షుడు, జేఏసీ సభ్యుడు దొంగ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, నరపురం, సఖినేటిపల్లి మండలాల ఈవోపీఆర్డీలు, ఆంజనేయశర్మ, లక్ష్మీనారాయణ, నరసాపురం మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

నరసాపురం రూరల్: పాడి రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక పశు వైద్యశాలలో మంగళవారం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు చనిపోతే రైతులు నష్టపోకుండా బీమా అండగా ఉంటుందన్నారు. టోల్‌ఫ్రీ నంబరు 1962ను పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు.